


# సిరివెన్నెల తరంగాలు

## సిరివెన్నెల సీతారామశాస్త్రి



**దాదాపు 12 సంవత్సరాల క్రిందట విడుదలైన సిరివెన్నెల సీతారామ శాస్త్రిగారి 'సిరివెన్నెల తరంగాలు' పుస్తకం మార్కెట్లో లభ్యం కానందున, అశేష అభిమానుల కోరిక మీద ఆ పుస్తకాన్ని సీరియల్ గా ప్రచురించడం జరుగుతోంది. ఇందుకు ప్రత్యేక అనుమతి నిచ్చిన 'కౌముది'కి ఆత్మీయ మిత్రులు సిరివెన్నెల సీతారామశాస్త్రిగారికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం.**

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

## 19

పల్లవి: పారాహుషారైన పాట చిటికేసి రమ్మందిరోయ్

పైలాపచ్చీసైన ఆట చిందేసి లెమ్మందిరోయ్

ఓరోరి బైరాగి ఈ పొద్దు ఈ జోరు ఆపద్దు తనివితీరా దరువెయ్యరోయ్

ఊరూరా ఊరేగి ఈ డప్పు హోరెత్తిపోయేట్టు ఊపెక్కి పోనీయరోయ్

కష్టాలు కన్నీళ్ళకే వస్తూనే ఉంటాయిరోయ్

నవ్వంటు తోడుంటే చాల్లె ఏమైనా చెయ్యచ్చులే

మందిలో కొందరు రాబందులై అందిందంతా కాజేసి జైహింద్ అంటారా

మందలై పందలై పసికందులై జనమంతా తలలొంచేసి ఖర్మనుకుంటారా

బతకడం బరువయ్యేలా తెగ పీడిస్తుంటే

దారుణం దారులు మూసి వేటాడుతు ఉంటే
ప్రాణం విసిగి పిల్లే అయినా బెబ్బులి అయిపోదా
చీమంత ఓ చిన్ని చినుకే తుఫాను అవుతుందిలే
ఈనాటి ఈ నిప్పు తునకే కార్చిచ్చు అవుతుందిలే

చిక్కగా చీకటే కమ్మిందని – లోకం వెళ్ళి సూర్యుణ్ణి రారమ్మని పిలవాలా
కొండలా పాపమే పెరిగిందని – కాపాడంటూ ఈ సంఘం మన సాయం అడగాలా
కళ్ళలో కత్తులు దూసే కసి కలిగిందంటే
గుండెలో భగ్గున రేగే అగ్గి రగులుకుంటే
నెత్తురు మండే ప్రతివాడు సూరీడే అయిపోడా
ఏ కొంప కొల్లేరు కానీ – నాకేమి పట్టిందని
నిద్దర్లో మునిగున్న వాణ్ణి – కదిలించడం నీ పని!!
చావైతే ఈ పూట కాకుంటే రేపైనా వస్తుంది తప్పించుకోలేవులే
బ్రతుకంటే మన చేతిలో ఉంది – భయమంటు వదిలేస్తే మనమాట వింటుందిలే!

(సిందూరం చిత్రంలో శ్రీ సంగీత సారథ్యంలో మలేషియా వాసుదేవన్, మోహన్ దాస్, శ్రీనివాస చక్రవర్తి పాడినది)

★★★

నువ్వేమి చేశావు నేరం – నిన్నెక్కడంటింది పాపం... చినబోకుమా
చేయూతనందించు సాయం – ఏనాడు చేసింది సంఘం గమనించుమా
కన్నీటి వర్షానికి కష్టాలు చల్లారునా
మార్గం చూపే దీపం కాదా ధైర్యం ||నువ్వేమి||

జరిగింది ఓ ప్రమాదం – ఏముంది నీ ప్రమేయం
దేహానికయిన గాయం – ఏ మందుతోనో మాయం
విలువైన నిండు ప్రాణం – మిగిలుండటం ప్రధానం
అది నిలిచినంత కాలం – సాగాలి నీ ప్రయాణం
స్త్రీల తనువులోనే శీలమున్నదంటే
పురుష స్పర్శతోనే తొలగిపోవునంటే
ఇల్లాలి దేహాలలో శీలమే ఉండదనా
భర్తన్న వాడెవడూ పురుషుడే కాదు అనా
శీలం అంటే గుణం అనే అర్థం ||నువ్వేమి||

గురివింద ఈ సమాజం – పరనింద దాని నైజం
తన కింద నలుపు తత్వం – కనిపెట్టలేదు సహజం
తన కళ్ళ ముందు ఘోరం – కాదనదు పిరికి లోకం
అన్యాయమన్న నీపై – మోపింది పాప భారం
పడతి పరువు కాచే చేవలేని సంఘం
సిగ్గు పడకపోగా నవ్వుతోంది చిత్రం
ఆనాటి ద్రౌపదికి – ఈనాటి నీ గతికి
అసలైన అవమానము చూస్తున్న ఆ కళ్ళది
అంతేగాని నీలో లేదే దోషం ||నువ్వేమి ||

(పెళ్ళి చేసుకుందాం చిత్రానికి కోటి సంగీత సారథ్యంలో జేసుదాస్ పాడినది)

చలెక్కి వుందనుకో ఏ చలాకి రాచిలకో
చిటుక్కుమందనుకో ఏ చిటారు కొమ్మెనకో
చురుగ్గా చూస్తావో – పరాగ్గా పోతావో
వలేస్తానంటావో – ఇలాగే ఉంటావో ||చలెక్కి||

చీకటుందని చింతతో నడిరాతిరి నిదరోలేదుగా
కోటి చుక్కల కాంతితో తన తూరుపు వెతుకునుగా
నలుదిక్కులలో నలుపుందనుకో – చిరునవ్వులకేం పాపం
వెలుగివ్వనని ముసుగేసుకొని మసిబారదు ఏ దీపం ||చలెక్కి||

కారునల్లని దారిలో ఏ కలల కోసమో యాతన
కాలు సాగని నింగిలో ఏకాకి యాత్రలోన
కలలన్నింటిని పిలిపించుకొని నిలవేసినా కళ్ళని
వెలివేసుకొని వెళ్ళిపోకు మరి విలువైన విలాసాన్ని ||చలెక్కి||
(అంతం చిత్రంలో ఆర్. డి. బర్మన్ సంగీత సారథ్యంలో చిత్ర, జోజో పాడినది)

★★★

పల్లవి: మనసు కాస్త కలతపడితె – మందు ఇమ్మని మరణాన్ని అడగకు
కనులనీరు తుడుచువారు ఎవరూ లేరని చితిఒడికి చేరకు
ప్రాణమన్నది బంగారు పెన్నిధి – నూరేళ్లు నిండుగా జీవించమన్నది
వేటాడువేళలో పోరాడమన్నది.... ||మనసు కాస్త||

కలసిరాని కాలమెంత కాటేస్తున్నా – చలి చిదిమేస్తున్నా
కూలిపోదు వేరు ఉన్న తరువేదైనా – తనువే మోడైనా

మాను జన్మకన్న – మనిషి ఎంత మిన్న
ఊపిరిని పోసే ఆడదానివమ్మా
బేలవై నువు కూలితే – నేలపై ప్రాణముండదమ్మ ||మనసు కాస్త||

ఆయువంతా ఆయుధంగా మార్చవే నేడు – పరిమార్చవే కీడు
కాళివైతే కాలికింద అణుగును చూడు – నిను అణిచేవాడు
మృత్యువును మించే హాని ఎక్కడుంది
ఎంత గాయమైనా మాని తీరుతుంది
అందుకే పద ముందుకే – లోకమే రాదా నీ వెనకే ||మనసు కాస్త ||

(శ్రీకారం చిత్రంలో ఇళయరాజా సంగీత సారథ్యంలో జేసుదాస్ పాడినది)

★★★

బెదిరితే భయపెడుతుంది వెనుకనే, లోకము
తరిమితే పరుగెడుతుంది తెలుసుకో నైజము
హడిలిపోతే అణిచివేసే అశ్వమీ కాలము
ఎగిరిదూకే తెగువ ఉంటే వెయ్యనీ కళ్ళెము

బలి కావాలి అంటూ అడిగే దేవతలైనా
పులినో కాలనాగునో తింటారా ఏమైనా
ఎపుడూ సాధుజీవులే ఎర అవుతారు నాయనా
బ్రతికే చేవ పోయెనా కాయడు దేవుడైనా
బలమే గుణము
అడగకెపుడూ ఎవరినైనా సాయమూ, న్యాయము

ఎవడున్నాడు క్రూరుడు యముడిని మించినవాడు

ఏవుంటుంది చూడు చావుని మించిన కీడు

తలవంచేసి దాగినా వదిలేనా ఒకనాడు

కలకాలము బ్రతికుండునా రోజూ చచ్చేవాడు

భయమే బరువు

కంటి ఎరుపే కాగడాగా నిశిని తరిమెయ్యరా!

(హలో డార్లింగ్ చిత్రానికి కీరవాణి సంగీత సారథ్యంలో బాలు పాడినది)

★★★

తెల్లారింది లెగండోయ్ – కొక్కొరోకో!

మంచాలింక దిగండోయ్ – కొక్కొరోకో!

పాములాంటి సీకటి పడగ దించిపోయింది

భయం లేదు భయం లేదు – నిదర ముసుగు తీయండి

సావులాటి రాతిరి సూరు దాటిపోయింది

భయం లేదు భయం లేదు – సాపలు సుట్టేయండి

ముడుసుకున్న రెక్కలిడిసి పిట్ట చెట్టు ఇడిసింది

మూసుకున్న రెప్పలిరిసి సూపులెగరనీయండి ||తెల్లారింది||

చురుకు తగ్గిపోయింది సెందురూడి కంటికి

చులకనైపోయింది – లోకం సీకట్లకి

కునుకు వచ్చి తూగింది – సల్లబడ్డ దీపం

ఎనక రెచ్చిపోయింది – అల్లుకున్న పాపం

మసకబారిపోయిందా సూసేకన్ను

ముసురుకోదా మైకం మన్నూమిన్ను

కాలం కట్టిన గంతలు తీసి – కాంతుల ఎల్లువ గంతులు వేసి ||తెల్లారింది||

ఎక్కిరించు రేయిని సూసి ఎఱ్ఱబడ్డ ఆకాశం
ఎక్కుబెట్టి ఇసిరిందా సూరీడి సూపుల బాణం
కాలి బూడిదైపోదా కమ్ముకున్న నీడ
ఊపిరితో నిలబడుతుందా చిక్కని పాపాల సీడ
సెవట బొట్టు సవురుతో సూరీణ్ణి ఎలిగిద్దాం
ఎలుగుసెట్టు కొమ్మల్లో అగ్గిపూలు పూయిద్దాం
వేకువ శక్తుల కత్తులు దూసి – రేతిరి మత్తును ముక్కలు సేసి

(కళ్ళు చిత్రానికి బాలు సంగీత సారథ్యంలో సిరివెన్నెల సీతారామశాస్త్రి పాడినది)

★★★

అతడు: సరేలే ఊరుకో – పరేషానెందుకో
చలేసే ఊరిలో జనాలె ఉండరా
ఎడారి దారిలో ఒయాసిస్సుండదా
అదోలా మూడు కాస్త మారిపోతె మూతి ముడుచుకునుంటారా
ఆటలోనో పాటలోనో మూడు మళ్ళీ మార్చుకోరా
మేరా నామ్ జోకరు మేరా కామ్ – నౌకరు
ఇదో నా చేతిలో అలాడిన్ లాంతరు
ఎనీథింగ్ కోరుకో క్షణాల్లో హాజరు
ఖరీదేం లేదు కాని – ఊరికేలే ఊపు రాదే ఓ మైనా
క్లాప్స్ కొట్టి ఈల వేస్తే చూపుతాలే నా నమూనా

అతడు: పిల్లి పిల్లదెపుడు ఒకే మాటగద – మియామియావ్!
కోడిపిల్లదెపుడు ఒకే కూత కద – కొక్కొ కొక్కొరకో!
కోకిలమ్మ ఆకలైనా ట్యూను మాత్రం మార్చదే

రామచిలక రాతిరైనా కీచురాయై కూయదే
అలాగే నీ పెదాల్లో నవ్వునెపుడు మారనీయకే ఏమైనా
కష్టమొస్తె కేరు చెయ్యక నవ్వుతో తరివేయవమ్మా!

అతడు: గూటి బిళ్ళ ఆడుదాం – సిక్సరు కొడదాం
పాప: క్రికెట్ కాదు గాని ఫన్నీగానే ఉంది
అతడు: ఏటిలోన దిగుదాం – ఈతలు కొడదాం
పాప: బఫెల్లోస్ కది – బాత్రూం కాదా మరి
అతడు: రాణిగారి ఫోజులో నువు కూర్చోమా ఠీవిగా
గేదెగారి వీపు మీద షైరుకెళదాం – స్టైలుగా
జురాసిక్ పార్కు కన్నా బెస్టుప్లేసీ పల్లెటూరే బుల్లెమ్మా!
బోలెడన్ని వింతలున్నాయ్ బోరులేక చూడమ్మా!

అతడు: వేడి వేడి పాలను ఎట్టా తాగుతావు?
పాప: ఉఫ్ ఉఫ్ మని ఊదేస్తాను కద
అతడు: రైసులోని రాయిని ఏం చేస్తావు మరి?
పాప: తుప్పు తుప్పుమని ఊసేస్తాను కద
అతడు: వేడిపాలలాంటివమ్మ ఏడిపించే రోజులు
పంటికింది రాళ్ళు అనుకో బాధపెట్టే బెంగలు
అలాగని పాలుకాస్తా పారబోసి పారిపోం గద చిన్నారి
ఆపదొస్తే తప్పుకుందికి చూసుకోమా చిన్నదారి
(లిటిల్ సోల్జర్స్ చిత్రానికి శ్రీ సంగీత సారథ్యంలో శ్రీ పాడినది)

★★★

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS